క్లుప్తంగా

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

కోటవురట్ల : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్, ప్రభుత్వ ఉద్యోగుల ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శిబిరం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటుందని, విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణులు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా చూపు పరీక్ష, ఆటో రీఫ్రాక్షన్, స్లిట్ ల్యాంపు ఎగ్జామినేషన్, డాక్టర్ కన్సల్టేషన్ చేస్తారని తెలిపారు. ఈహెచ్ఎస్, టీపీఏ, ఆరోగ్యభద్రత కార్డుదారులకు కేటరాక్టు, రెటీనా, కోర్నియా, గ్లూకోమా, ఆర్బిట్, పీడ్రియాటిక్ ఆప్తమాలజీ పరీక్షలు చేస్తారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోటవురట్ల : కైలాసపట్నం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో కోటవురట్ల గ్రామానికి సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వి.వి.వి.రామకృష్ణారావు తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ చేపడుతున్న కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వాటర్ ట్యాంకులో క్లోరినేషన్



వాటర్ ట్యాంకును శుభ్రపరుస్తున్న సిబ్బంది

కోటవురట్ల : వర్షాలు పడుతుండడంతో తాగునీరు కలుషితం కాకుండా సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ ముందస్తు చర్యలు చేపట్టారు. కె.వెంకటాపురంలోని 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షిత మంచి నీటి పథకం ట్యాంకు క్లీనింగ్ పనులు ఆదివారం నిర్వహించారు. ట్యాంకు లోపలకు దిగిన సిబ్బంది బ్లీచింగ్‌తో శుభ్రపరిచి క్లోరినేషన్ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. డయేరియా, డెంగ్యూ, జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ పారిశుధ్యం మెరుగుకు సహకరించాలని కోరారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా పింఛన్ల పంపిణీ

మునగపాక : మండలంలోని తోటాడ,ఉమ్మలాడ గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పర్యటన జరుగుతుందని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు టెక్కలి పరశురామ్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా పెంచిన పింఛన్లను సోమవారం నుంచి ఇంటివద్దే అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఉదయం 6 గంటలకు తోటాడ, 6.45 గంటలకు ఉమ్మలాడ గ్రామాల్లో ఎమ్మెల్యే చేతుల మీదుగా పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు.

రజాలలో తాగునీరు వృథా

రాంబిల్లి : రజాల గ్రామంలో తాగునీరు వృథా అవుతోంది. ఐదు నెలలుగా ఇదే విధంగా తాగునీరు వృథా అవుతున్నా ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, డీఈలు పట్టించుకోలేదు. పక్క గ్రామాల్లో తాగునీరు కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కానీ రజాలలో తాగునీరు చెరువులోకి పోయి వృథా అవుతోంది. పలు మార్లు ఏఈ వర్మకు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయిందని గ్రామ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరే గాక మోటారు తిరగడం వల్ల కరెంట్ బిల్లు భారం ప్రభుత్వంపై పడుతుంది. రజాల గ్రామంలో జల్‌జీవన్‌మిషన్ కింద ఐదు నెలల క్రితం పైపులైను వేశారు. కుళాయిలు ఏర్పాటు చేశారు. కానీ వీటి ద్వారా నీరు సరఫరా కావడం లేదు. దీంతో ట్యాంకు ఏర్పాటు చేసి దానికి పెద్ద పైపు ఏర్పాటు చేసి ఊరంతా స్కూల్ వద్ద గల ఈ ట్యాంకు వద్దకు వచ్చి నీరు మోసుకుంటున్నారు. నీరు పట్టుకున్న తర్వాత గంటల తరబడి తాగునీరు చెరువులోకి వృధాగా పోతుంది. ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి తాగునీరు ఇవ్వడం జల్‌జీవన్ మిషన్ లక్ష్యం అయితే ఈ గ్రామంలో స్కూల్ వద్ద గల ట్యాంకు వద్దకు వచ్చి నీరు తీసుకెళ్లాల్సి వస్తుంది. దీంతో వృద్ధులు ఇబ్బందులు పడతున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి తాగునీరు వృధాను అరికట్టడంతో పాటు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని రజాల గ్రామస్తులు కోరుతున్నారు.

పూడిమడక రోడ్డులో భయం..భయం

- మితిమీరిన వేగంతో భారీ వాహనాల రాకపోకలు
- తరుచూ ప్రమాదాలు
- వేగ నియంత్రణపై చర్యలకు స్థానికుల వేడుకోలు

ఒకవైపు మితిమీరిన వేగం..మరో వైపు పరిమితికి మించి లోడుతో భారీ వాహనాల రాకపోకలు. దీంతో పూడిమడక రోడ్డుపై ప్రయాణం అంటేనే ఆందోళన చెందాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఎపుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు, ద్విచక్ర వాహనదారులు అను నిత్యం ఆందోళనకు గురవుతున్నారు.



పూడిమడక రోడ్డు



మునగపాక వద్ద పూడిమడక రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు

మునగపాక : అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న ప్రధాన రహదారిలో నాగులాపల్లి, ఒంపోలు, గంగాదేవిపేట, మునగపాక, తిమ్మరాజుపేట, హరిపాలెం, కొండకర్ల, చోడపల్లి తదితర గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు పలు పనులపై నిత్యం ఆటోలు, ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డుపై 20 టన్నులకు మించి వాహనాలు రాకూడదు. అయినా 60 నుంచి 80 టన్నులతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీనికి తోడు అతివేగంగా వాహనాలు రావడంతో ఈ మార్గంలో ప్రయాణించేవారు ఆందోళనకు గురవుతున్నారు.

సార్వత్రిక ఎన్నికల ముందే శాశ్వత రహదారి

సార్వత్రిక ఎన్నికల ముందే గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన యూవీ రమణమూర్తిరాజు పూడిమడక రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేయించారు. ఈ రోడ్డు శిథిలావస్థకు గురికావడంతో రాకపోకలు సాగించేవారు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రూ.6.8 కోట్ల వ్యయంతో వీఎంఆర్‌డీఏ సహకారంతో శాశ్వత మరమ్మతులు చేపట్టారు. దీంతో భారీ వాహనాల రాకపోకలకు అడ్డూ అదుపూ లేకుండా పోతుంది. నిత్యం వందలాది వాహనాలు అటు అచ్యుతాపురంలోని ఎస్ఈజెడ్‌లో పనిచేసేందుకు అలాగే అనకాపల్లిలో వ్యాపారాలు, ఉద్యోగాలు చేసేందుకు రాకపోకలు సాగిస్తుంటారు.

వేగ నియంత్రణపై దృష్టి సారించాలి....

భారీ వాహనాలను పూడిమడక రోడ్డులో నియంత్రించాల్సిన అవసరం ఉంది. రయ్‌మంటూ భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించే క్రమంలో ప్రమాదాలు బారిన పడుతున్నారు. భారీ వాహనాల కారణంగా గతంలో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు గాయాల పాలవడం అలాగే కొంతమంది మృత్యువాతకు గురైన సంగతి తెలిసిందే. పోలీసు అధికారులు భారీ వాహనాల రాకపోకలపై నియంత్రణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే ఈ మార్గంలో అధిక లోడుతో వాహనాలు రాకూడదని ఆర్అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా ఫలితం కనిపించడం లేదు. పలు ప్రయివేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ప్రయివేటు ఐటీఐలలో చదువుకునేందుకు నిత్యం ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు.



పూడిమడక రోడ్డులో దూసుకువస్తున్న వాహనం

వాహనాల వేగం నియంత్రించాలి



పూడిమడక రోడ్డులో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలి. ఈ రోడ్డులో ప్రయాణం అంటేనే భయంగా ఉంటుంది. మితిమీరిన వేగం ఒకవైపు అధిక లోడులతో భారీ వాహనాల రాకపోకలు మరోవైపు విచ్చల విడిగా సాగుతుంది. అధికారులు తగు చర్యలు తీసుకొని వాహనాల వేగాన్ని నియంత్రించాలి. –దాడి అప్పలనాయుడు, ద్విచక్ర వాహనదారుడు, మునగపాక

చర్యలు తీసుకుంటాం



పూడిమడక రోడ్డులో అధికలోడుతో వాహనాలు వెళితే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించాం. మితిమీరిన వేగంతో వాహనాలు నడిపినా భారీ వాహనాలు రాకపోకలు సాగించినా చర్యలు తప్పవు. వాహన డ్రైవర్లకు పదేపదే అవగాహన కల్పిస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం.

–పి.ప్రసాదరావు, ఎస్ఐ, మునగపాక

మా ఊళ్లో గ్రంథాలయం సేవలు అభినందనీయం

మునగపాక : విద్యాభివృద్ధికి మాఊళ్లో గ్రంథాలయం అందిస్తున్న సేవలు అభినందనీయమని విశ్రాంత ఉపాధ్యాయులు పెంటకోట తులసీరావు కొనియాడారు. మండలంలోని మంగళవరపుపేటలో మా ఊళ్లో గ్రంథాలయం ద్వారా నిర్వహిస్తున్న డ్రాయింగ్,హ్యాండ్ రైటింగ్, తెలుగు పద్యాలను లయబద్ధంగా పాడడం వంటి కార్యక్రమాలపై ఇస్తున్న శిక్షణ తరగతులను ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా ఊళ్లో గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా గుడ్డ సంచులను అందజేశారు. కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ రామచంద్రరావు, విశ్రాంత ఉపాధ్యాయులు కిల్లాడ ప్రసాదరావు, గ్రంథాలయ కార్యదర్శి యల్లపు సంజీవరావు, మహిళా డైరెక్టర్లు యల్లపు నాగమణి, ఆడారి సునీత, భీశెట్టి తులసి, గ్రంథాలయాధికారి ఆడారి జగ్గప్పారావు పాల్గొన్నారు.



గుడ్డ సంచులను అందజేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు తులసీరావు

చెర్లోపాలెం పాల సంఘ అధ్యక్షునిగా మాణిక్యం



చెర్లోపాలెం పాలసంఘ అధ్యక్ష, డైరెక్టర్లు

మునగపాక : మండలంలోని చెర్లోపాలెం పాల సంఘం అధ్యక్షునిగా అప్పికొండ మాణిక్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాలసంఘాల కార్యవర్గాల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం మాణిక్యంను సంఘ అధ్యక్షునిగా రైతులు ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా అప్పికొండ వరలక్ష్మి, కాయల చినమ్ములు, పి.అప్పలకొండ, డి.అప్పలరాజు, కె.చిన రమణ, కాండ్రేగుల చిన వెంకటి, అప్పికొండ అప్పలరాజు, డి.రమణమ్మ, బొండా నూకరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి రైతులకు మెరుగైన సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాయల ప్రకాశరావు పాల్గొన్నారు.

విద్యార్థులతో సూర్య నమస్కారాలు

నక్కపల్లి : మండలంలో చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఆదివారం సూర్య నమస్కారాలు, ఆదిత్య హృదయం పారాయణం చేయించారు. వేంపాడు ఆయుష్ ఆస్పత్రికిచెందిన యోగా ట్రైనర్ డీ రాంబాబు పాఠశాలలో విద్యార్థులకు కొన్ని రోజుల నుంచి యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం విద్యార్థులతో ఆదిత్య హృదయం పారాయణం చేయించారు. అనంతరం సూర్య నమస్కారాలు నేర్పించారు. ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు సూర్యనమస్కారాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతి రోజు విద్యార్థులకు గంటపాటు యోగా నేర్పించడం జరుగుతుందన్నారు. మండలంలో ఉన్న అన్ని పాఠశాలల్లోను ఈ యోగా తరగతులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



విద్యార్థులకు సూర్యనమస్కారాలు నేర్పిస్తున్న దృశ్యం

దివ్యాంగులకు ఆదర్శం హెలెన్ కెల్లర్

అనకాపల్లి: అతి చిన్న వయస్సులో వినికిడి, దృష్టిని కోల్పోయి, మాట్లాడలేని స్థితి నుంచి ప్రపంచానికి మార్గదర్శకంగా మారిన హెలెన్ కెల్లర్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని విజువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొరుప్రోలు వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో హెలెన్ కెల్లర్ 144వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులు మనోధైర్యంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

మొక్కల పెంపకంలో భాగస్వాములు కావాలి



మొక్కల పంపిణీ ప్రారంభిస్తున్న సంకల్పం సంస్థ ప్రతినిధులు



స్థానికులకు మొక్కలు అందజేస్తున్న నిర్వాహకులు

యలమంచిలి రూరల్ : ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని దినచర్యగా చేపట్టాలని సంకల్పం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని కొత్తపేటలో ఆదివారం ఆ సంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్న అటవీశాఖాధికారులు చేయాల్సిన ఇలాంటి కార్యక్రమాలను స్వచ్ఛంధ సంస్థలు చేయడం ఆ శాఖ అధికారుల చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు.మొక్కల పెంపకం భావి తరాలకు,మానవాళి మనుగడకు ఎంతో అవసరమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు.ఇలాంటి మంచి కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి ప్రగడ నాగేశ్వరావు అన్నారు.అంతకుముందు మొక్కల పెంపకాన్ని చేపట్టడంపై అందరూ ప్రతిజ్ఞ చేశారు.అనంతరం సుమారు 1000 మొక్కల్ని స్థానికులకు పంపిణీ చేశారు నిర్వాహకులు.వర్షాకాలం కావడం,మొక్కలు నాటేందుకు అనుకూల వాతావరణం ఉండడంతో పలువురు మొక్కలు తీసుకునేందుకు ఎగబడ్డారు.కార్యక్రమంలో బొద్దపు శ్రీను,గొర్లె నానాజీ,కొటారు సాంబ పలువురు సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యలమంచిలి రూరల్ : అన్ని దానాల్లో కెల్లా రక్తదానం చాలా గొప్పదని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని కొత్తపేటలో కాకినాడ శ్రీ అభయ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రక్తదాతలతో మాట్లాడి, వారి సేవా భావాన్ని ప్రశంసించారు. ప్రశంసా పత్రాలను వారికి అందజేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న క్షతగాత్రులు, రోగులు, గర్భిణులు, బాలింతలకు రక్తం అవసరం అవుతుందన్నారు. సకాలంలో రక్తం ఎక్కించని పక్షంలో మృత్యువాత పడే అవకాశం ఉంటుందన్నారు. యువత సామాజిక స్పృహతో రక్తదానం చేయడానికి ముందుకురావాలన్నారు. బ్లడ్ సెంటర్ నిర్వాహకులు మొత్తం 50 మంది యువకుల నుంచి రక్తం సేకరించారు. రక్తదానం చేసిన వారందరికీ పండ్లు, కొబ్బరి బొండాలు, సరోగ్ట్ప కెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక కూరగాయల వ్యాపారి గొలుసు పూడి శ్రీనివాస్ (బుజ్జి) ఆర్థిక సహాయం అందించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వర్రావు, అత్రెపు సత్య గుప్తా, వైఎస్సార్‌సీపీ నాయకులు బొద్దపు ఎర్రయ్యదొర, టీడీపీ, జనసేన పార్టీల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఏఎంఏఎల్ కళాశాలకు 'నాక్' గుర్తింపునకు కృషి

తుమ్మపాల: వేల మంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడేలా నాణ్యమైన విద్యనందించిన ఏఎంఏఎల్ కళాశాలకు నాక్ గుర్తింపు వచ్చేందుకు తమ వంతు కృషి చేస్తామని కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు బొడ్డేడ అప్పారావు, కృష్ణంరాజు, జగదీశ్వరరావు తెలిపారు. పట్టణంలోని జార్జిక్లబ్ ఆవరణలో నిర్వహించిన ఏఎంఏఎల్ కళాశాల పూర్వవిద్యార్థుల సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. జూలై నెల 18న నాక్ బృందం కళాశాలను పరిశీలించనున్న నేపథ్యంలో వివిధ ఉద్యోగ, వ్యాపారాలలో ఉన్నతంగా స్థిరపడిన పూర్వ విద్యార్థులు హాజరు కావాల్సిందిగా పిలుపునిచ్చారు. కళాశాలలో సోలార్ ప్లాంట్, డైనింగ్ హాల్ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. కళాశాలలో చదువుకుని రాజకీయాల్లో, ఉన్నత ఉద్యోగాల్లో, సినిమా రంగంలో రాణిస్తున్న వారిని ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు, పర్యవేక్షకురాలు పి.అనూరాధ, వ్యాయామ సంచాలకులు డాక్టర్ కేఎస్ఎన్ నాయుడు, పూర్వ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

పూడికలు తొలగించరూ..

అనకాపల్లి: ఎన్టీఆర్ క్రీడామైదానం ఎదురుగా ఉన్న ఎల్లయ్యకాలువలో పూడిక, చెత్తాచెదారాల తొలగింపు చేపట్టలేదు. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల దోమలు వృద్ధి చెంది, రోగాలు వ్యాపిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ అధికారులు తక్షణ చర్యలు తీసుకుని డ్రైనేజీల్లో పూడిక తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

8న వైఎస్సార్ జయంతికి ఏర్పాట్లు

వైఎస్సార్‌సీపీ నేత వీసం



వీసం రామకృష్ణ

నక్కపల్లి : ఈనెల 8వ తేదీన దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ పిలుపు నిచ్చారు. పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు నాలుగు మండలాల్లో మహానేత జయంతిని ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఆదివారం వై.వి. సుబ్బారెడ్డిని కలవడం జరిగిందన్నారు. ఇక నుంచి పార్టీ తరపున కార్యక్రమాలు నిర్వహించాలని నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సుబ్బారెడ్డి సూచించారన్నారు. పార్టీ కార్యక్రమాల్లో భాగంగా వైఎస్సార్ జయంతిని ఈనెల 8వ తేదీన ప్రతి గ్రామంలోను, మండల కేంద్రంలోను ఘనంగా నిర్వహించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ మేరకు నెరవేరుస్తుందో వేచి చూడాలన్నారు. అమలు సాధ్యం కాని హామీలు ఇవ్వడం వల్లే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఒకటోతేదీన పెంచిన పింఛన్ల పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం ఇంత వరకు తల్లికి వందనం కింద విద్యార్థుల చదువుల కొరకు ఇచ్చే ఆర్థిక సాయం, అన్నదాతలకు పెట్టుబడి కింద ఇచ్చే రైతు భరోసా ఆర్థిక సాయం ఎప్పుడు చెల్లిస్తారో చెప్పక పోవడం శోచనీయమన్నారు. అలాగే ఆడబిడ్డ నిధి, 18 ఏళ్లు దాటిన మహిళలకు ప్రతి నెలా ఇచ్చే రూ.1500 ఆర్థిక సాయం, నిరుద్యోగులకు ప్రతినెలా ఇచ్చే రూ.3వేలు భృతి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా ఎప్పటి నుంచి ఇస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. గతంలో జగనన్న ప్రభుత్వం అమ్మఒడి, రైతు భరోసా, మత్స్యకార భరోసా వంటి హామీలు అధికారం చేపట్టిన రెండునెలల్లోనే అమల్లోకి తెచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం సూపర్‌సిక్స్ పేరుతో ప్రకటించిన హామీలను ఎప్పటి నుంచి ఇస్తారో ప్రకటించలేదన్నారు. తల్లికి వందనం ఇవ్వకపోయినా, తండ్రికి ఇంధనం మాత్రం తక్షణమే సమకూర్చారన్నారు.

చురుగ్గా వ్యవసాయ పనులు

కోటవురట్ల : వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు, కూలీలు పొలం పనుల్లో నిమగ్నమవుతున్నారు. నారుపోత, కలుపుతీత పనుల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. వారం రోజులుగా మండలంలో వాతావరణం చల్లబడి అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. దాంతో రైతులు ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. గత ఏడాది ఖరీఫ్ సీజనులో 1750 హెక్టార్లలో వరి సాగు జరిగింది. ఈ ఏడాది కూడా ఆరంభంలో వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు ఉత్సాహంగా పొలం పనులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పలు గ్రామాల్లో కొందరు రైతులు నారు కోసం విత్తనాలు చల్లుతుండగా, మరికొన్ని చోట్ల ఇప్పటికే విత్తనాలు వేసిన రైతులు కలుపుతీత పనులు చ



అన్నవరంలో పొలం పనులు చేస్తున్న కూలీలు

నేడు పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

నక్కపల్లి : ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సోమవారం నుంచి బట్వాడా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీవో శ్రీనివాసరావు, మండలపరిషత్ పరిపాలనాధికారి సీతారామరాజు తెలిపారు. పింఛన్లు పంపిణీ చేసే సిబ్బందితో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ పింఛన్లను గ్రామకార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే తీసుకెళ్లి అందజేసే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. పింఛన్ల పంపిణీకి సంబంధించి నగదును రెండు రోజుల ముందునుంచే బ్యాంకుల నుంచి డ్రాచేసే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. నగదును డ్రా చేసి గ్రామాలకు తరలించే సమయంలో సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు నక్కపల్లిలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, స్టేట్ బ్యాంకుల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి సిబ్బందికి సూచనలు చేయడం జరిగిందని తెలిపారు. సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు ఈ పింఛన్ల పంపిణీలో భాగస్వాములు కావాలన్నారు. నక్కపల్లి మండలంలో దాదాపు 12 వేలకు పైచిలుకు లబ్ధిదారులు ఉన్నారని, వీరందరికీ పింఛన్ల పంపిణీ సోమవారం నుంచి ప్రారంభమవుతుందన్నారు. లబ్ధిదారులంతా ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలన్నారు. పింఛన్లు పంపిణీ చేసే ప్రభుత్వ శాఖల సిబ్బంది ఈ విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులకు, గ్రామ పెద్దలకు ముందుగానే తెలియజేయాలన్నారు.



పింఛన్ల సొమ్ము డ్రాచేసే విషయంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో తదితరులు

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక : ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని మండలంలో పలు ప్రాంతాల్లో ఆదివారం తిలకించారు. మోదీ ప్రసంగాన్ని టీవీ ద్వారా తిలకించేందుకు వీలుగా తోటాడ వద్ద 174 పోలింగ్ బూత్ కార్యక్రమంలో ఏర్పాటు చేశారు. బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు యల్లపు రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సంపర భార్గవాచార్యులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బొడ్డేడ భాస్కర్, కూటమి నేతలు ఆడారి జనార్దనరావు, నాయుడు, పొలమరశెట్టి మురళి, ఆళ్ల వెంకటేష్ పాల్గొన్నారు.



ప్రధానమంత్రి మన్‌కీ బాత్ ప్రసంగాన్ని తిలకిస్తున్న దృశ్యం

పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు

పాయకరావుపేట : నేటి నుంచి రెండు రోజుల పాటు జరుగబోయే సామాజిక పింఛన్ల పంపిణీకి తగు ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీవో కె.స్వప్న తెలిపారు. మండలంలో గల 24 గ్రామాల్లోను 13,135 మందికి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. సోమ, మంగళ వారాల్లో ఉదయం 6 గంటలకే పింఛన్ల పంపిణీ ప్రారంభం అవుతుందని తెలిపారు. ఆయా గ్రామ సచివాలయాల సిబ్బంది వీఆర్ఏలు పాఠశాలల్లో పనిచేసే అదనపు సిబ్బందితో కలిపి మొత్తం 200 మంది సిబ్బంది రెండు రోజులు పింఛన్లు పంపిణీ చేస్తారని తెలిపారు.